ప్రజాశక్తి

ఆదివారం 6 జులై 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

జీవన స్థితిగతులను

మెరుగుపరుచుకోవాలి..

- ప్రభుత్వ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలి
- కలెక్టర్ వెంకటమురళి



లబ్ధిదారుల యూనిట్ల పంపిణీ సందర్భంగా ఆటోలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర, కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వం అందించే వివిధ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులు అందిపుచ్చుకొని వారి జీవన స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు యంత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల జీవనోపాదులు మెరుగుపరచుకోవడానికి మెప్మా శాఖ ద్వారా చీరాల మండలంలో ఇద్దరు, బాపట్ల మండలంలో ఇద్దరు లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ ఆటోలను ముద్రా రుణం కింద కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు. ఒక్కొక్క యూనిట్ ఖరీదు రూ.3 లక్షల 63 వేలు అని, ఈ వాహనాలను రాపిడో సంస్థతో అనుసంధానించడం ద్వారా లబ్ధిదారులకు రూ.56 వేలు ప్రోత్సాహకం అందజేయబడుతుందని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ద్వారా 646 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా 3686 మందికి, శ్రీనిధి పథకం ద్వారా ▶ 3లో



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఎమ్మెల్యే దామచర్ల

మహిళలకు అండగా ప్రభుత్వం

- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ
- ఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని కలెక్టర్ (ఇన్‌ఛార్జి) ఆర్. గోపాలకృష్ణ చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లోని రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పి)కు 164 ట్యాబ్‌లు, డిజి లక్ష్మిలకు 100 బయోమెట్రిక్ పరికరాలను శనివారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో పంపిణీ చేశారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్‌తో పాటు ఒంగోలు శాసనసభ్యులు ▶ 2లో

వ్యవసాయాన్ని

కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నం

- రైతుల ఐక్య ఉద్యమాలతోనే అడ్డుకట్ట..
- అమెరికాతో వ్యవసాయ ఒప్పందంతో పొంచి ఉన్న ప్రమాదం
- సెమినార్‌లో ఆల్‌ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు అమ్రారామ్



పొగాకు సమస్యలపై ఎంపీ అమ్రారామ్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, చుండూరి రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, పరిశ్రమలు, స్మార్ట్‌మీటర్ల పేరుతో విద్యుత్తును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నాలను ప్రారంభించిందని.. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు రైతాంగం ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆల్‌ఇండియా కిసాన్‌సభ జాతీయ ఉపాధ్యక్షులు, రాజస్థాన్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు అమ్రారామ్ పిలుపునిచ్చారు. శనివారం నాడు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన 'కార్పొరేటీకరణ– వ్యవసాయ రంగంపై ప్రభావం' అంశంపై సెమినార్ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరు జయంతిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కల్తీపై నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. జిల్లాలో రైతులు చేసిన ఉద్యమం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ▶ 2లో



సెమినార్‌లో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

పొగాకు కొనుగోలుకు

రూ.1000 కోట్లు కేటాయించాలి

8 తీర్మానాలను అమోదించిన రైతు సదస్సు

వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.1,000 కోట్లు కేటాయించాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతుసంఘం ప్రవేశపెట్టిన తీర్మానాలను రైతు సదస్సు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 'కార్పొరేటీకరణ–వ్యవసాయ రంగంపై ప్రభావం' అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఆల్‌ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, ఎంపీ అమ్రారామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు వర్జీనియా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించి క్వింటా రూ.20 వేల చొప్పున ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేయించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన మిర్చి మద్దతు రేటు రూ.11,781 ఏ మాత్రం గిట్టుబాటు కాదని రూ.20 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, శనగలపై ప్రభుత్వం 30 శాతం దిగుమతి సుంకాన్ని అమలు చేయాలని, శనగలు క్వింటా రూ.10 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని, బర్లీ పొగాకును మొత్తం కొనుగోలు చేయాలని, అదానీతో ఒప్పందం చేసుకున్న స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను రద్దు చేయాలని, రుణాలు ఒక్కసారి రద్దు చేయాలని, వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని, జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంతిబాబు సభలో ఆమోదం కోసం ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మార్కాపురంలో 'భూ'మంతర్.!

- కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇద్దరు కీలక అధికారులు
- పెద్దఎత్తున చేతులు మారిన ముడుపులు
- విలువైన భూమిని అనధికార వ్యక్తికి కట్టబెట్టేందుకు పావులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ఓ రెవెన్యూ అధికారితో పాటు మరో మున్సిపల్ అధికారి ముడుపులిస్తే.. ఏ పనైనా చిటికెలో చేసేస్తున్నారు. ఒకరి స్థలం మరొకరికి కట్టబెట్టేలా కొత్త తరహాలో అక్రమ పద్ధతులను ఎంచుకున్నారు. కొత్త తరహా అక్రమాలతో భారీ స్థాయిలో ముడుపులు మూటగట్టుకోవడం జరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. పట్టణంలోని ఎన్.ఎస్.నగర్లోని స్థలాల విషయంలో జరిగిన అక్రమాలే అందుకు ఉదాహరణ!

కొందరు అధికారులు ధనదాహంతో అక్రమ పద్ధతుల్లో ఖరీదైన స్థలాలకు అనధికార వ్యక్తులకు హక్కులు కల్పిస్తున్నారు. దీంతో సొంత స్థలాలు కలిగిన వారు ఆందోళన చెందుతున్నారు. మండల స్థాయిలో రెవెన్యూ అధికారి, మున్సిపాలిటీ పరిధిలో కీలక అధికారి ఈ అక్రమ వ్యవహారాలకు తెరలేపారు. ఇదే అక్రమ పద్ధతి కొనసాగితే సొంత స్థలాలను ఎంత కాలం కాపాడుకోగలమంటూ యజమానులు సైతం ప్రశ్నార్థకంలో పడ్డారు.

స్థానిక ఎన్.ఎస్. నగర్లోని ఎబిఎం స్థలాలపై వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఎన్ఎస్ నగర్ లోని ఎబిఎం కాంపౌండ్లో 80 సెంట్ల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కాజేసేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. దీని ఖరీదు ప్రస్తుత మార్కెట్లో రూ.15 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. బాప్టిస్ట్ మిషన్ ఆస్తులను నాదెళ్ల సుబ్రమణ్యం, హనుమాన్ రియల్ ఎస్టేట్ తరపున నాదెళ్ల నాగవేణి కలిసి గత 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. అప్పట్లో వీరికి అమ్మిన వ్యక్తులు ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తరువాత ఎన్నో వివాదాలు, కోర్టు కేసులు నడిచాయి. హనుమాన్ రియల్ ఎస్టేట్ యజమానులకు అప్పట్లో అమ్మకం జరిపిన అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ సొసైటీ (ఎబిఎఫ్ఎస్) ప్రతినిధులే తమకూ హక్కులు కల్పించి రాసి ఇచ్చారని ఇప్పుడు కొత్తగా ఏర్పడిన సొసైటీ వ్యక్తులు ▶ 3లో



అక్రమ పద్ధతిలో పన్ను వేసిన స్థలం ఇదే..



హత్యకు గురైన వెంకటేశ్వర్లు (ఫైల్)

పాతకక్షల నేపథ్యంలో

వ్యక్తి దారుణహత్య

భయాందోళనలో నల్లకుంట్ల గ్రామస్తులు ▶ 3లో

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

దిగి వచ్చి బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్న అంశాన్ని ప్రస్తావిస్తూ.. జిల్లా రైతాంగ ఉద్యమం పట్ల అభినందనలు తెలిపారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తోం దన్నారు. వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ కంపె నీలకు అనుకూలంగా మార్చినట్లు దుయ్యబట్టారు. రూ.400కు దొరికే డిఎపిని రూ.1400కు పెంచారని, దీంతో పాటు కల్తీ తీవ్రమైనట్లు పేర్కొన్నారు. కల్తీ ఎరువుల నిరోధక చట్టం విస్తు గొలిపే రీతిలో రూపొందించడం విచారకరమ న్నారు. రూ.1400 విలువైన కల్తీ డిఎపి పట్టు బడితే కేవలం రూ.500 పెనాల్టీతో సరిపుచ్చే చట్టాలు రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టే దిశగా, మోడీ అమెరికాకు లొంగిపోతున్నట్లు విమర్శించారు. మిత్ర దేశంగా పేర్కొన్న అమెరికా వ్యవసాయ రంగానికి 77 శాతం సబ్సిడీ ఇస్తుండగా భారతదేశంలో కేవలం రెండు శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. కేరళలో జరిగిన అఖిల భారత కిసాన్ సభ నిర్ణయం మేరకు రైతాంగం గిట్టుబాటు ధరలు, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని, మిర్చి, శనగ వంటి పంటలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతుసంఘం నేతలు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు.

అమెరికాతో ఒప్పందం ప్రమాదకరం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అమెరికాతో వ్యవసాయ ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. ఈ ఒప్పందం కుదిరితే లీటర్ పాలు 26 రూపాయలకే దిగుమతి అవుతాయని, రూ నాలుగు వేల చొప్పున 100 లక్షల బేళ్ల పత్తి దిగుమతి అవుతుందన్నారు. శనగ, మొక్కజొన్న వంటి 14 రకాల వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతాయని తెలిపారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు కాక రైతాంగం ఆందోళన చెందుతున్న ఈ తరుణంలో అమెరికాతో వ్యవసాయ ఒప్పం దం రైతాంగానికి చేటు తెస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా తొమ్మిదో తేదీ రైతాంగం దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి..

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించిన కేంద్రం, అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రూ.81 వేల కోట్ల బనకచర్ల ప్రాజెక్టు చేపట్టిన ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో వెలుగొండ పూర్తి చేయలేదా? అని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా వ్యవసాయం అంచెలంచెలుగా కార్పొరేట్‌మయం అవుతోందన్నారు. గతంలో పార్లమెంట్‌లో చట్టాలు చేస్తే, నేడు కార్పొరేట్ కంపెనీల్లో చట్టాలు చేస్తున్నారని తెలిపారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల కంటే కార్పొరేట్ కంపెనీలే ఈ ప్రభుత్వాలకు ముఖ్యమనిపిస్తున్నాయన్నారు. కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేయక తప్పదన్నారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు..

కిసాన్ సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ డబల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాల ధరలు మూడు రెట్లు పెరగ్గా రైతాంగ ఉత్పత్తులకు మూడో వంతు ధర కూడా లభించకపోవడం బాధాకరమన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రవేశపెట్టిన ఎనిమిది తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఈ రైతాంగ సెమినార్లో బాపట్ల రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మాబు,పెంట్యాల హనుమంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు, పిల్లి తిప్పారెడ్డి బెజవాడ శ్రీనివాసరావు, పి ఏడుకొండలు, ఊసా వెంకటేశ్వర్లు టి చిన్నపరెడ్డి, దగ్గుబాటి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. సదస్సులో ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన రైతాంగ ఉద్యమ గేయాలు అలరించాయి.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అద్దంకి

I.A.No: 367/2025
I.A.No: 277/1997
O.S.No: 29/1989

కాకాని పెద్ద రంగారావు మరియు ముగ్గురు....వాది

Vs

కాకాని చిన్న రంగారావు మరియు కొందరు
.... ప్రతివాదులు

To

1.కొల్లూరి యలమందమ్మ భర్త లేటు వీరయ్య**(D12)**
2.కొల్లూరి వెంకటరమణ తండ్రి లేటువీరయ్య**(D14)**
3.పర్చూరి పద్మజ భర్త రవికుమార్ **(D16)**
R/o కాకానిపాలెం, అద్దంకి గ్రామం,
మండలం బాపట్ల జిల్లా.

పై నంబరు I.A లో వాది పంపిన నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారు ఉత్తర్వుల మేరకు మీరు తేది : 17-07-2025న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో I.Aను మీపరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయునది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి **ఇట్లు**
తేది: 05-07-2025 **మోతుకూరి సుభాష్‌బాబు**
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్,అద్దంకి

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలి మరియు 8వ అడిషనల్ జిల్లా జడ్జివారి కోర్టులో

MC. No. 41/2024

సాగిరి (ఐనబత్తిని) వెంకట శిరీష మరియు ఇంకొందరు ....వాదులు

V/s

సాగిరి కమలాకర్ .... ప్రతివాది

To.
(ప్రతివాది)
సాగిరి కమలాకర్,
తండ్రి, మల్లికార్జున రావు,
R/o. డోర్ నెంబర్, 1-1, గంగనగర్,
సోమవరప్పాడు, తూర్పు గంగవరప్పాడు పోస్టు,
తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబరు భరణం కేసులో మీకు నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపినా నోటీసు చేరనందున శ్రీ కోర్టు వారు ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈప్రకటన చూసిన తరువాత తేది.17-07-2025 ఉదయం 10.30లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగాగాని, లేదా అడ్వకేటు ద్వారా గాని హాజరై నీయొక్క సమాధానం. తెలుపు కొనవలసినది, లేని యెడల పైతెలిపిన భరణం కేసులో మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పంగులూరి గోవిందయ్య
అడ్వకేట్, ఒంగోలు

మహిళలకు అండగా ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

దామచర్ల జనార్ధనరావు, ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఒంగోలు బ్రాంచ్ సిఈఒ డాక్టర్ నల్లూరి నితిన్, గైనకాలజీ డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లు తమ గ్రూపులకు సంబంధించిన వివరాలు, లావాదేవీలను పుస్తకాలలో కాకుండా నేరుగా ఈ ట్యాబ్‌లలో నమోదు చేయాల్సి ఉంటుందని మెప్మా పీడీ తెలిపారు. తద్వారా ఆ వివరాలు ముఖ్యమంత్రి డాష్ బోర్డుకు అనుసంధానం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ యాజమాన్యం, మెప్మా మధ్య ప్రత్యేక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రకారం మెప్మా మహిళలకు అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు నిర్వహిస్తారు. చికిత్స అవసరమైన వారికి ఆయా కేసులను బట్టి 20 శాతం వరకు ఫీజులో రాయితీ ఇస్తారు. మెప్మా మహిళల కుటుంబసభ్యులు చదువుకున్నట్లయితే వారి ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలను కూడా కల్పిస్తారు.

అమ్మ కూడా ఎస్‌హెచ్.జి. లీడర్

ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ మాట్లాడుతూ తన తల్లి కూడా స్వయం సహాయక సంఘ (ఎస్ .హెచ్. జి.) లీడర్ అని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగానూ సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి మహిళలు జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఏ సహకారం కావాలన్నా వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని, ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన సహాయం అందేలా చూస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. డాక్టర్ నల్లూరి నితిన్ ఆసుపత్రి ద్వారా అందించే వైద్య సదుపాయాలను, రాయితీల వివరాలను వెల్లడించారు. ఆరోగ్యం పట్ల, ముఖ్యంగా మహిళలకు వచ్చే సమస్యల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్ ప్రతిమ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా ఐబి ఫణి కుమారి, బిఎల్ రాణి, ఏవో వినీల్ కుమార్, మెప్మా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భారతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లైంట్స్ అయిన కేసరి కార్తీక్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి మరియు వారి అమ్మ గారు కేసరి మస్తానమ్మ భర్త వెంకటరెడ్డి, కృష్ణంరాజు వారిపాలెం గ్రామం, కోరిశపాడు మండలం, బాపట్ల జిల్లా అనువారులకు చెందిన ఆస్తి డాక్యుమెంట్స్ కనపడకుండా పోయినవి.వాటి తాలూకా పమిడిపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో గల షెడ్యూల్ దాఖల ఆస్తి సర్వే నెంబరు 954/3 య. 0.90 సెంట్లు, 954/3 య. 0.80 సెంట్లు, 953/5 య. 0.80 సెంట్లు మొత్తం విస్తీర్ణం య.2.50 సెంట్లు గల ఆస్తి మరియు డిటో గ్రామ సర్వేనెంబర్ 911/1య. 1.16 సెంట్లు, 892/2 య.1.90 సెంట్లు, 956/2 య.1.93 సెంట్లు మొత్తం4.99 సెంట్లు గల ఆస్తులను అమ్మనబ్రోలు రిజిస్ట్రార్ ఆఫీసులో డాక్యుమెంటు నెంబరు 817/2013, 1609/2015, 983/2011, 984/2011 డాక్యుమెంట్స్ తీసుకొని కృష్ణంరాజు వారిపాలెం గ్రామము నుండి మేదరమెట్లకు వస్తుండగా పోయినవి. కావున ఎవరికైనా దొరికితే పైఅడ్రస్సు వారికి అందజేయ వలసనిధిగా కోరుచున్నాము. మా క్రైంట్స్ డాక్యుమెంట్స్ ను ఎవరి వద్ద గాని, ఏ బ్యాంకులో గాని వారికి తెలిసి తనఖా పెట్టలేదు. అని తెలియపరుచుచున్నాము.

ఇట్లు
యర్రమోతు రమేష్‌బాబు
అడ్వకేట్, అద్దంకి
సెల్ నెం : **9966046270**

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No : 12/2025
in
OS No : 49/2015

Between :-
నల్లగొర్ల రామకృష్ణ ....DHR

V/s

మాలెంపాటి రవికుమార్ ..... JDR

To
JDR) మాలెంపాటి రవికుమార్
S/o సాంబశివ రావు, హిందూ
వయసు : 52, వ్యాపారం,
గాంధీనగర్ కాలనీ, చీరాల

పై నెంబర్ EP No : 12/2025 లో JDR ఆయన మీకు Noticeలు ఎన్నిపర్యాయములు పంపినసూకావాలనియే తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టువారి ఉత్తర్వుల ద్వారా మీకు Notice Order అయినందున ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా ది:25-07-2025 వ తేదీన మీరు స్వయముగా గాని వకీలు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకునవలసినది. అలాకాని యెడల మీపరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది .

వాయిదా :- 25-07-2025
చీరాల
05-07-2025 **ఇట్లు**
BN మూర్తి
అడ్వకేట్, చీరాల

GENERAL NOTICE
In the court of the Principal Senior Civil Judge (Senior Division).at:Bapatla.
I. P. No. 6 /2025.

Between:
Dosapati Siva Prasad ...Petitioner
Versus
1.The Manager, H.D.F.C Bank, Wanaparthi,
2.The Manager, H.D.F.C Credit-cards, Mumbai,
3. The Manager, Navi Finserv Iballuru Village, Bengalore,
4. The Manager, India Infoline Finance Limited, Thane,
5. The Manager, D.M.I. Finance Pvt. Limited, New Delhi
6. The Manager, Aditya Birla Finance, Mumbai,
7. The Manager, Fibe Early salary Service Pvt. Limited, Pune.
8. The Manager, Kredit Bee (Krazy Bee Services Pvt. Limited, Bangalore
9. The Manager, Maha Janani Chits Pvt. Limited, Kadapa,
10. Dara Sunil Babu
11. Kari Srinivasa Rao
12. Official Receiver, Guntur
.....Respondents.

నా క్లయింటు అయిన దోసపాటి శివప్రసాద్ గారు వ్యాపారము చేసి దివాళా తీసియున్నాడు. రెస్పాండెంట్లపై I.P ధాఖలు చేసికొనియున్నారు. ఇంకా ఎవరైనా నా క్లయింటు అయిన దోసపాటి శివ ప్రసాద్ గారికి అప్పులు ఇచ్చియుంటే మీరు ది:29-7-2025 తేదీన వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ, లేదా ప్లీడరు గారి ద్వారాకాని కోర్టుకు హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పిటీషనరు కొరిన విధముగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
వాయిదా తేది : 29-07-2025

ఇట్లు
పిటీషనరు తరపు అడ్వొకేట్స్,
C. PREMCHAND,
Y. R.K. SARMA.
ADVOCATES ,BAPATLA.
Cell No.7989330046,
9247471374.

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP.No.123 /2024
IN
OS.No.61 /2022

గోసుల వెంకట సుబ్బయ్య
.....DHR/ PETITIONER
Vs
పోకూరి పద్మానాభ రావు
. ....RESPONDENT/JDR

To.
J.D.R/RESPONDENT
పోకూరి పద్మానాభ రావు S/o గురవయ్య,
R/o Pcపల్లె గ్రామం, మరియు మండలం,
ప్రకాశం జిల్లా,
మరియు
కలికవాయి గ్రామం మరియు Post,
సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా:
మరియు
K. Parameswari salila Technologies,
C/o, E. బానమ్మ డోర్ నెం. 6-144, ధనలక్ష్మి నగర్, అవిలాల, తిరుపతి పట్టణం, చిత్తూరు జిల్లా.

పై నెంబర్ EP.NO.123/2024 IN OS.NO.61/2022 పిటీషన్ లో రెస్పాండెంట్ అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషన్ EP.NO.123/2024 IN OS.NO.61/2022 లో నీహాజరు నిమిత్తం తేదీ 30-07-2025నకు వాయిదా కలదు. కనుక ఆ రోజు ఉదయం 10-30 గంటలకు పైకోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీ లాయరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు EP.NO.123/2024 IN OS.NO.61/2022 లో నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై నెంబరు EP.NO.123/2024 IN OS.NO. 61/2022 పిటిషన్ను నీపరోక్షమున తీర్మానించెదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 30-07-2025

ఇట్లు
పెండ్యాల శివహరి B.A.L., B.L.,
అడ్వకేట్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా,

టెండర్ ప్రకటన
గ్రామ పంచాయితి కార్యాలయము - ఎం.నిడమానూరు
టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

ఆర్.ఓ.సి. నెం: 01/2025 **తేది: 05-07-2025**

ప్రకాశంజిల్లా టంగుటూరు మండలం ఎం.నిడమానూరు గ్రామ పంచాయితీ నందు 2025-2026 సంవత్సరమునకు తేది:01-07-2025 నుండి 30-06-2026 వరకు కాంట్రాక్ట్ పద్ధతిపై పనులు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఎం.నిడమానూరు గ్రామ పంచాయితి కార్యదర్శిచే గాని ,వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తేది:10-07-2025న ఉదయం10-00గంటల నుండి మధ్యాహ్నం 2-00 గంటల వరకు ఎం.నిడమానూరు గ్రామ పంచాయితీ నందు టెండర్లు స్వీకరించి, అదేరోజు 10-07-2025 సాయంత్రం 4-00 గంటల గ్రామాపంచాయతి సర్పంచ్, హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండర్ షెడ్యూల్ వివరాలు ప్రకారం షరతులు, నిబంధనలకు లోబడి ధరావత్తు చెల్లించిన రశీదును టెండరు షెద్యులు కు జతపరచవలెను.ఏ కారణం చూపకనే టెండర్లు వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు గ్రామపంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు. మిగతా వివరములు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం	పని వివరాలు	వర్తించు కాలము	సంఖ్య	ధరావత్తు
1.	స్వీపర్లు	తేది.01-07-2025 నుండి తేది.30-06-2026 వరకు	2	200/-
2.	టర్న్ కాక్	తేది.01-07-2025 నుండి తేది.30-06-2026 వరకు	3	300/-
3.	ట్రాక్టర్‌డ్రైవర్	తేది.01-07-2025 నుండి తేది.30-06-2026 వరకు	1	100/-

షరతులు: 1.పై పోస్టులు శ్రీయుత జిల్లా పంచాయితి అధికారి ,ఒంగోలు ప్రకాశం జిల్లా వారి ఉత్తర్వులకు లోబడి అమలులోకి వచ్చును.జిల్లా పంచాయితి అధికారి ఆమోదం ఉత్తర్వుల మేరకు పేమెంట్ చెల్లించబడును.
2.ఏ కారణం చేత నైనా టెండర్లు రద్దు పరుచుటకు ,అమలు పరుచుటకు పంచాయితి కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు.
3.ధరావత్తు వాపసు చేయుటలో ఎలాంటి వడ్డీ చెల్లించబడదు.
4.గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమె వెతనములు చెల్లించబడును.
5.బిల్లు జాప్యములో కూడా ఎలాంటి వడ్డీ చెల్లించబడదు.
6.పని సంతృప్తికరంగా లేనియెడల సదరు కాంట్రాక్ట్ ను రద్దు చేయు అధికారం గ్రామ పంచాయితి వారికి కలదు.
7.కాంట్రాక్ట్ ఒక సంవత్సర కాలం అనగా 01-07-2025 నుండి 30-06-2026 వరకు మాత్రమె అమలులో ఉందును .

బి.సుబ్బాయమ్మ
పంచాయితి కార్యదర్శి, ఎం.నిడమానూరు
టంగుటూరు (మం), ప్రకాశం జిల్లా

పాత కక్షల నేపథ్యంలో..

వ్యక్తి దారుణ హత్య

వేటకొడవళ్లతో దాడి చేసి కిరాతకంగా చంపిన వైనం

భయాందోళనలో నల్లకుంట్ల గ్రామస్తులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని నల్లకుంట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి వ్యక్తి హత్య సంచలనం సృష్టించింది. మొహరం వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన వ్యక్తిని ప్రత్యర్థులు వేటకొడవళ్లతో అర్ధరాత్రి దాడి చేసి హత్య చేశారు. హత్య చేసిన విధానం గ్రామ ప్రజల్లో తీవ్ర భయాందోళనకు దారితీసింది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

2022లో నల్లకుంట్ల గ్రామ సర్పంచి మొద్దు నాగలక్ష్మి భర్త మొద్దు వెంకటేశ్వర్లును హత్య చేశారు. ఈ హత్య కేసులో బైరవబోయిన వెంకటేశ్వర్లు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. హత్య జరిగినప్పటి నుంచి ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటూనే ఉంది. ఇరువర్గాలు కూడా ఏ చిన్న అవకాశం దొరికినా అలజడి సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో మొద్దు వెంకటేశ్వర్ల హత్య కేసు కోర్టులో విచారణలో ఉండగానే శుక్రవారం రాత్రి నల్లగుంట్ల గ్రామంలో జరుగుతున్న మొహరం ఉత్సవాల



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనూహ్యంగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్పంచ్ మొద్దు నాగసలక్ష్మి అనుచరులు ముందుగానే కాపు కాస్తూ వచ్చారు. బైరవబోయిన వెంకటేశ్వర్లు పండుగలో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో అతనిపై వేటకొడవళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో బైరవబోయిన వెంకటేశ్వర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నరికి చంపిన విధానం గ్రామ ప్రజల్లో తీవ్ర భయాందోళనకు దారితీసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన తీరును పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన ఆధారాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ హత్య వెనుక ఎలాంటి రాజకీయ కోణాలున్నాయి? గతంలోని కక్షలే ఈ దారుణానికి దారి తీశాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు గ్రామంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఈ సంఘటనతో గ్రామంలో కక్ష సాధింపు రాజకీయాలు మరోసారి మళ్లీ తెరపైకి వచ్చాయి.

డిఎస్పి నాగరాజు విచారణ..

మార్కాపురం డిఎస్పి డాక్టర్ యు నాగరాజు హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పలువురిని ప్రశ్నించారు. వివరాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నల్లగుంట్ల సర్పంచ్ నాగలక్ష్మి భర్త హత్యకేసులో బైరవబోయిన వెంకటేశ్వర్లు ప్రధాన నిందితుడిగా ఉన్నారన్నారు. దీంతో ప్రత్యర్థి వర్గం పరస్పర రాజకీయ విభేధాలతో హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఈ హత్యలో మొద్దు తిరుపతిరావుతో పాటు మరికొంత మంది ఉన్నారన్నారు. దర్యాప్తులో అన్ని విషయాలు తెలుతాయని వివరించారు. ఆయన వెంట యర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకరరావు, దోర్నాల ఎస్సై మహేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ ఎఆర్ దామోదర్

పలు పోలీస్ స్టేషన్లలో తనిఖీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కనిగిరి సబ్ – డివిజన్ పరిధిలోని వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలు, పలు రికార్డులు, రిసెప్షన్, రిజిష్టర్‌ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంఘటనలపై, ప్రజా పిర్యాదులపై వేగంగా స్పందించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలన్నారు. బాధితులకు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే ఫిర్యాదులుదారుల పట్ల, మర్యాదాపూర్వకంగా మాట్లాడి వారి సమస్య తెలుసుకొని వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈయన వెంట కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ బీమా నాయక్ వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని, సిబ్బంది ఉన్నారు.

సీఎస్‌పురం రూరల్ : ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, పోలీస్ క్వార్టర్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యస్వంత్, పామూరు సీఐ భీమా నాయక్, ఎస్సై వెంకటేశ్వర నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: సాధారణ తనిఖీల్లో భాగంగా ఎస్పి పామూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి, కేసుల స్థితిగతులు తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఆపన్న హస్తం కోసం..

అభాగ్యుడి ఎదురుచూపు..!

చిన్ననాటి నుంచే వికలాంగుడు

ఆధార్ కార్డు లేక పింఛను అందని వైనం

పూట గడవని పరిస్థితి..

దాతలు ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-పీసీపల్లి

ఇతను మాట్లాడలేడు.. వినపడదు.. నడవడానికి కూడా ఇబ్బందే.. కర్ర సాయం లేనిదే బయటకు రాలేని పరిస్థితి. చిన్ననాడే తల్లిదండ్రులు చనిపోయారు. వికలాంగుడు అయినా పింఛను కానీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందే పరిస్థితి లేదు. ఆధార్ కార్డు లేదు.. రేషన్ కార్డు లేదు. తిండి లేక మనిషి బక్కచిక్కి వంగి పోయాడు. ప్రభుత్వం లేదా దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు.

పీసీపల్లి మండలంలోని పెద ఇర్లపాడు దళిత కాలనీకి చెందిన మక్కెన మూగయ్యది అసలు పేరు కోటేసు. అందరూ మూగయ్య అంటారు. 50 ఏళ్ల మూగయ్య చిన్నప్పటి నుంచి వికలాంగుడు. చిన్న వయసులో తల్లిదండ్రులు చనిపోయారు. ప్రస్తుతం ఇతనికి ఏ దిక్కు లేదు. ఇతని ప్రభుత్వం ఏ సాయం అందటం లేదు. గతంలో ఆధార్ కార్డు లేని రోజుల్లో మనిషిని చూసి రేషన్ కార్డు, పెన్షన్ ఇచ్చే రోజుల్లో కూడా దళితుడైన మూగయ్యకు ఏ అధికారి సాయం చేయలేదు. పెద ఇర్లపాడులో అధికంగా భూములు ఉండి, లక్షల రూపాయలు డబ్బులు ఉన్న వారికి కూడా కొంతమందికి ఇప్పటికీ పెన్షన్ వస్తుంది. అన్ని అవయవాలు పనిచేస్తూ కూలి పనులకు వెళ్లేవారు కూడా వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్నారు. కానీ మూగయ్యకు ఆధార్ కార్డు కూడా లేదు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రస్తుతం ఆధార్ కార్డు తప్పనిసరి. కానీ ఇతని చేతి వేళ్ళు ఆధార్ కార్డు పడేవిధంగా



పనిచేయటం లేదు. అందువలన ఆధార్ కార్డు సెంటర్‌కి ఎన్నిసార్లు తీసుకుపోయినప్పటికీ ఆధార్ రావటం లేదు. వీరి అన్న కుమారులు మక్కిన పోలయ్య, నాగయ్యలు భోజనం పెడుతుంటారు. వారు కూడా కూలి పనులు చేసుకుంటూ అంతంత మాత్రంగా బతుకుతున్నారు. వారు తినేదాంట్లోనే బాబాయి మీద మమకారంతో భోజనం పెడుతుంటారు. ఇతను ఏ పనీ చేయలేని పరిస్థితి. ఇంటి నుంచి బజారులోకి రావాలన్నా కూడా కర్ర పట్టుకొని ఒంగి నడవాల్సిన పరిస్థితి. రోజురోజుకూ బలహీనపడి మరి ఒంగిపోతున్నాడు.

సంస్కారవంతుడు మూగయ్య

తమ గ్రామానికి అధికారులు కానీ మరెవరైనా వచ్చినప్పుడు తనకు మాటలు రానప్పటికీ, సైగలతో నమస్కారం పెడుతూ, దండం పెడుతుంటారు. ఎవరు వచ్చినా తన దీనగాథను సైగల ద్వారా తెలియపరిచి సహాయం చేయమని వేడుకుంటున్నాడు. కానీ ఏ అధికారి కూడా ఇంతవరకు ఇతని గురించి పట్టించుకున్న పాపానలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధార్ కార్డుకు అవసరమైన సహాయం అందించి, ఆదుకోవాలని కోరుతున్నాడు. ఆధార్ కార్డు వస్తే ప్రభుత్వం ద్వారా పెన్షన్ తీసుకోవచ్చని ఇరుగు పొరుగువారు అంటున్నారు. ఎలాంటి ఆధారం లేని అభాగ్యుడు మక్కిన పోలయ్య. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండలోని మత్స్య శాఖ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన జరిగింది. సోమరాజు పల్లి గ్రామపంచాయతీలోని నర్రావారిపాలెంకు చెందిన ఊసా వెంకటేశ్వర్లు (48) అనే వ్యక్తి గ్రామానికి వెళుతుండగా గుర్తుతెలియని మోటార్ బైక్ ఢీకొని సిమెంట్ రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కాపురంలో 'భూ'మంతర్.!

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నారు. 1973లోనే మేము సొసైటీగా ఏర్పడ్డామని వారు చెబుతుండగా... 50 ఏళ్లుగా లేని సొసైటీ ఇప్పుడు ఎలా వచ్చిందని ఆస్తులు కొనుగోలు చేసిన వాళ్లు ప్రశ్నిస్తున్నారు. డబ్బు చెల్లించి అధికారికంగా, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తులపై ఇప్పుడు వివాదం ఏమిటని వాస్తవంగా కొనుగోలు చేసిన వారి వాదన. ఈ వివాదంపై మద్రాస్ హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సివిస్ నెంబర్ 124/1994, 3863 ఆఫ్ 2024, 5144, 7395 ఆఫ్ 2018, 5753, 5755 ఆఫ్ 2024లకు 2024 డిసెంబర్ 19వ తేదీన మద్రాస్ హైకోర్టు ఒక తీర్పునిచ్చింది. ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చస్, ది సమావేశం తెలుగు బాప్టిస్ట్ చర్చెస్, అమెరికన్ ఫారిన్ బాప్టిస్ట్ మిషన్ సొసైటీల మధ్య నెలకొన్న వివాదాలపై అసలు హక్కుదారులు ఎవరు? వారికి ఎలా సంక్రమించింది? ప్రస్తుతం హక్కుదారులు అని చెప్పుకుంటున్న వారి వద్ద ఉన్న ఆధారాలు ఏంటి? అనే అన్ని విషయాలపై సమగ్రం గా విచారణ జరిపింది. త్వరలోనే కోర్టు ఆధ్వర్యంలోనే ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని రకాల వివాదాలు ఆ కమిటీ పరిధిలోనే నిజ నిర్ధారణ చేసుకొని పరిష్కరించుకోవాలని సూచించటం జరిగింది. ఈ కారణంగా ఈ ఆస్తులపై ఎవరికి హక్కు ఉంది అని తేల్చాల్సింది కోర్టు పరిధిలోని కమిటీ మాత్రమేనని ఆ తీర్పులో స్పష్టమైంది. ఆ కోర్టు తీర్పు ఇలా ఉండగా ఇక్కడి అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. ఈ పాటికే ఎన్.ఎస్.నగర్లో ఎన్నో రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఒకరి నుంచి మరొకరికి చేతులు మారాయి. ఈ క్రమంలో వందేళ్ల క్రితం ఆర్ఓ్ ఆధారమంటూ ఆ ఖరీదైన 3,841 చ.గ.ల స్థలాన్ని కాజేసేందుకు కుట్రలు జరిగాయి. కోర్టు పరిధిలో ఉన్న ఈ భూమికి ఇవ్వకూడని సర్టిఫికెట్ ఒకటి రెవెన్యూ అధికారి జారీ చేసినట్టు తెలిసింది. దాని ఆధారంగా మున్సిపల్ కీలక అధికారి ఒకరు ఆ ఖాళీ స్థలానికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వేయడం జరిగింది. ఈ తతంగం నడిపినందుకు కీలకంగా వ్యవహరించిన ఆ ఇద్దరు అధికారులు సుమారు రూ.అర కోటి వరకు ముడుపులు పుచ్చుకున్నట్లు సమాచారం. దీన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలనుకున్న వ్యక్తి ఓ బడా రాజకీయ నేత అండదండలతో ఇదంతా జరుగుతోందని ప్రచారంలో ఉంది. ఇలాంటి అక్రమ పద్ధతులపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే... ఇదే తరహాలో పెద్ద ఎత్తున ఖరీదైన ఖాళీస్థలాలు పరులపాలవడం ఖాయం!

జీవన స్థితిగతులను మెరుగుపరుచుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

384 మందికి, లక్ పతి దీదీ ద్వారా 14 మంది సభ్యులకు, ఉన్నతి పథకం ద్వారా రూ.53 కోట్లు 42 లక్షల చెక్కును, మెప్మా శాఖ ద్వారా 340 మంది స్వయం సహాయక గ్రూపు సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా సూక్ష్మ చిన్న మరియు మధ్యతరహా రుణం కింద రూ.5 కోట్ల 20 లక్షల చెక్కులను కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు లబ్ధిదారులకు అందజేశారు.

మెప్మా శాఖ ద్వారా ప్రతి మండలంలో, ప్రతి వార్డులో సి ఎస్ సి కేంద్రాల ద్వారా డిజిటల్ సర్వేసుల నిర్వహణకు డిజిటల్ లక్ష్మి కార్యక్రమం ద్వారా మెప్మా శాఖ సిబ్బంది 56 మందికి బయోమెట్రిక్ యంత్రాలను, 30 మందికి ట్యాబ్‌లను జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, పిడి డిఆర్‌డిఏ శ్రీనివాసరావు, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి రాజ్ దేబోరా, బిసి సంక్షేమ శాఖ అధికారి శివలీల, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



సమ్మె నోటీసు అందజేస్తున్న రేపల్లె సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -రేపల్లె

దేశవ్యాప్తంగా జులై 9న జరుగనున్న కార్మిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ విస్తృతంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ డిఎం, ఐసిడిఎస్ సిడిపిఓ, రైస్ మిల్ అసోసియేషన్, మోళ్ళగుంట హాస్పిటల్, పలు సంస్థలుకు దేశవ్యాప్త సమ్మెనీ తెలియపరుస్తూ నోటీసులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ దేశంలో కనీసవేతనాలు అమలు చేయాలని, కార్మిక హక్కులు కాపాడాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని అన్నారు. కార్మికవర్గం ఐక్యంగా జులై 9న సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. స్వాతంత్ర పూర్వం నుండి కార్మికవర్గం పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని అన్నారు. వీటి వల్ల భవిష్యత్తులో యూనియన్ ఏర్పాటు, వేతనాల పెంపుకు, పని గంటలు పెంచడం వంటి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. ఐసిడిఎస్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు బడ్జెట్ తగ్గిస్తున్నారని అన్నారు. గోరంత వేతనం ఇచ్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. కార్మికులకు ద్రోహం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె జరపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ ఇన్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె ఝాన్సీ, వై మేరీ, మణి, కె రత్నకుమారి, కె కృష్ణకుమారి, డి జ్యోతి, ఎస్ రాజ్యలక్ష్మి, మదర్ తెరిసా హెయిర్ బస్ డ్రైవర్ యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు సిహెచ్ వీరలక్ష్మి, రైస్ మిల్ యూనియన్ వి సుబ్బారావు, యు రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వేమూరు : కార్మికవర్గాన్ని బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి అగస్టీన్ కోరారు. పంచాయతీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు అమలు చేయాలని చెప్పారు. 132, 142, 680, జిఒలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణ మోహన్ మాట్లాడుతూ కార్మికులు రోజుకు 10 గంటలు పని చేయాలని మంత్రి వర్గం చేసిన తీర్మానాన్ని వెనక్కి అతీసుకోవాలని కోరారు. టెండర్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం జులై 9న సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొనాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ డి నవరాణికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో గాలి రాంబాబు పాల్గొన్నారు. మండలంలోని చావలి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు.

వేటపాలెం : కార్మిక హక్కుల రక్షణ కోసం జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొలని వేటపాలెం, దేశాయిపేట పంచాయతీ కార్మికులు నిర్ణయించారు. వేటపాలెం పంచాయతీ కార్యదర్శి సురేంద్రబాబు, దేశాయిపేట పంచాయతీ గుమస్తాకు సమ్మె నోటీసులు శనివారం అందజేశారు. సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులు హరిస్తునారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, కృష్ణ, కన్నయ్య, కృపమ్మ పాల్గొన్నారు.



వేమూరులో సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు



సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

కూటమి ఏడాది పాలనలో ధరల దరువు

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఆరోపణలు

ప్రజాశక్తి - అద్దంకి



సిహెచ్ గంగయ్య

కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడంలో ప్రథమ స్థానంలో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఆరోపించారు. ఈ ఏడాది విద్యుత్తు చార్జీల ద్వారా రూ.15 వందల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. చెత్త పన్ను రద్దు చేసి రాజకీయ ప్రచారం చేసుకుంటున్న పాలకులు పట్టణాలు, నగరాల్లో ఇల్లు, షాపులు ఖాళీ స్థలాలకు విలువ ఆధారిత ఆస్తిపన్ను భారీగా పెంచిన విషయాన్ని ప్రభుత్వం ప్రజలకు తెలియకుండా మభ్య పెట్టాలని చూస్తుందని అన్నారు. నిర్మాణ అనుమతుల అతిక్రమణ పేరుతో పెద్ద ఎత్తున అపరాధ రుసుములు, గ్రామాల్లో ఆస్తిపన్ను పెంచడానికి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. గత టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిట్కో ఇల్లు బ్యాంకు అప్పుల రద్దుచేసి వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని అందుకు విరుద్ధంగా లబ్ధిదారుల మీద బ్యాంక్ అధికారుల ఒత్తిళ్లు పెరిగాయని అన్నారు. ఇప్పటికీ గత ప్రభుత్వం నిర్మించిన జగనన్న ఇల్లు అసంపూర్తిగానే ఉన్నాయని అన్నారు. 8 లక్షల ఇల్లను రద్దు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని, పేదలు నివాసం ఉన్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అనేక ప్రాంతాల్లో పేదల గుడిసెలు కూల్చి వేసిన సందర్భాలు ఉన్నాయని అన్నారు.

అద్దంకి పట్టణం అభివృద్ధి ఎక్కడ

పట్టణంలో 60 నుండి 70 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఓటర్ల శాతం కూడా గతంలో 25వేల నుండి 32వేలకు పెరిగింది. ఆ స్థాయిలో అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తాగునీరు రెండు రోజులకు ఒక సారి ఇస్తున్నారని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. రోడ్డుకు తూర్పు వైపు సాగర్ కాలువను డ్రైనేజీగా మార్చుకున్నారని అన్నారు. సాగర కాలువ కట్టపై మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనేకసార్లు అధికారులకు సాగరు కాలువ కట్టపై నివాసం ఉంటున్న పేదలను వారికి ఇచ్చిన స్థలాల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోమని చెప్తున్నప్పటికీ ఇంతవరకు కమిషనర్‌కు సాధ్యం కాలేదని అన్నారు. సింగరకొండలో 80 కుటుంబాలకు నివాస స్థలాలు ఇచ్చినప్పటికీ ఆ ప్రాంతంలో నివాస యోగ్యమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని అన్నారు.

విద్యుత్తుబారాలు అధికం

రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలు పెంచేది లేదని సిఎం చంద్రబాబు స్వయంగా అనేక సభల్లో చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు చితికి పోతున్నారని అన్నారు. 2022- 23లో విద్యుత్తు వినియోగించుకున్న సమయంలోని రీడింగును బట్టి ఇప్పుడు వాడుకుంటున్న విద్యుత్ బిల్లుకు అదనంగా కలిపి ప్రజల నుండి వసూళ్లు చేస్తూ నడ్డి విరుస్తున్నారని అన్నారు. సర్‌ఛార్జిలు రద్దు చేయాలని కోరారు.

క్రికెట్ టీమ్‌కు టీ షర్టులు అందజేత

ప్రజాశక్తి - సంతమాగులూరు



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మానసికంగా, శారీరకంగా, దృఢంగా ఎదగటానికి క్రీడలు దోహద పడతాయని ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. మండలంలోని కొమ్మాల పాడులో గ్రామ క్రికెట్ జట్టుకు జెర్సీ టీ షర్టులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ ఆటపై మరింత మక్కువ పెంపొందించేందుకు ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి షేక్ సిపాయి బాజీ మసూద్, చెన్నుపల్లి నాగూర్, కాలేషా గారి బుజ్జి, ఎం ఖాదర్ మస్తాన్, బి ఏడుకొండలు, ఎం ఖాదర్ భాష, క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న నాగబోయిన రంగారావు

'అల్లూరి' పట్టుదల ఆదర్శం

ప్రజాశక్తి - పంగులూరు

స్వాతంత్ర పోరాటంలో ప్రజలను ఐక్యం చేసేందుకు, తెల్ల దొరలను దేశం నుండి తరిమేందుకు అల్లూరి సీతారామ రాజు పట్టుదల, క్రమశిక్షణతో ఉద్యమాన్ని నడిపారని, 'అల్లూరి' పట్టుదల, క్రమశిక్షణ నేటి విద్యార్థులకు ఎంతో అవసరమని మాజీ ఎంపిపి నాగబోయిన రంగారావు అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక హై స్కూలు విద్యార్థులకు 'ప్రజాశక్తి' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్ర గురించి విద్యార్థులు వ్రాశారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశం కోసం, స్వాతంత్రం కోసం సీతారామరాజు జీవితాన్ని త్యాగం చేశాడని అన్నారు. ఆయన చూపిన పట్టుదల, కృషి, దక్షిత, చివరకు బ్రిటిష్ వారిని దేశం నుండి వెళ్లిపోయేటట్లు చేసిందని అన్నారు. నేటి విద్యార్థులు కూడా స్వాతంత్ర సమరయోధుల గురించి తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, మంచి భవిష్యత్తు పొంది, తల్లి, దండ్రులను బాగా చూసుకోవాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆదర్శ భావాలతో, శాస్త్రీయ ఆలోచనలతో చదువుకోవాలని చెప్పారు. మూఢ నమ్మకాలు, ఆత్మలను నమ్మ కుండా కృషి ఆధారంగా జీవించాలని అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక ఆదర్శవంతమైందని, విద్యార్థులను శాస్త్రీయ పద్ధతిలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులకు, పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సిఐటియు కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, ఉపాధ్యాయులు వి లక్ష్మీకాంతమ్మ, భాస్కర మూర్తి, కరిముల్లా, విద్యార్థులు మహాలక్ష్మి, అఖిల తదితరులు ప్రసంగించారు. అంతకుముందు విద్యార్థినిలు పాటలు ఆలపించారు. ప్రజాశక్తి విలేఖరి పి ఏలియా పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎఐఐఇఎ నాయకులు

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఎఐఐఈఎ 75వ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సింగరకొండలోని వృద్ధాశ్రమంలో భోజనానికి అవసరమైన సరుకులు ఇవ్వడంతోపాటు డెఫ్ అండ్ డం పాఠశాల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం డివిజనల్ జాయింట్ సెక్రెటరీ ఆర్‌విఎస్ రామిరెడ్డి, డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ పారా శ్రీనివాసరావు, అద్దంకి ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్, ఉద్యోగుల నాయకులు, ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నోటు పుస్తకాల దాతకు సత్కారం

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్న నూతలపాడుకు చెందిన దాత చిమట వెంకటేశ్వర్లును స్థానిక ఎంపియూపి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు దుశ్యాలువాతో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగమణి మాట్లాడుతూ వెంకటేశ్వర్లు పేద రైతు అయినప్పటికీ చదువుపై తనకున్న మక్కువతో గత 20ఏళ్ల నుండి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇవ్వడం ఆదర్శం అన్నారు. తమ పాఠశాల్లోని 80 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ స్కూల్ హెచ్‌ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు బి ప్రసాద్ బాబు, శివనాగశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఓ ప్రభాకరరావు

పారదర్శకంగా గణాంకాల సమీకరణ

ప్రజాశక్తి - బాపట్ల

పారదర్శకంగా పంచాయతీ గణాంకాల సమీకరణలు జరగాలని డిపిఒ కెఎల్ ప్రభాకరరావు అన్నారు. స్థానిక డిఆర్‌సి మీటింగు హాలులో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణలో ఆయన మాట్లాడారు. పంచాయతీల పురోగతి సూచికలు, 17 ప్రభుత్వ శాఖల పనితీరుపై గణాంకాల సమీకరణ ద్వారా అభివృద్ధి సూచికలను నిర్ణయించ నున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ నుండి సమాచార నివేదికలను తెప్పించుకుని ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ కె నేతాజీ, జె శ్రీనివాసరావు, బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓలు, ప్రతి పంచాయతీ నుండి ఒక కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

ప్రజాశక్తి - రేపల్లె



డా. నాంచారయ్య

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జులై 6 సందర్భంగా పశుసంవర్ధక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు సహాయ సంచాలకులు డాక్టర్ బి నాంచారయ్య తెలిపారు. పెంపుడు కుక్కలు ఉన్న యజమానులు పశు వైద్యశాల్లో సంప్రదించి కుక్కలకు వాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా

గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్నాం 29 చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్స్‌గా కుదించి హక్కులు లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వం నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నదన్నారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత వనరుల కల్పన లాంటి ఉన్నత లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం అమలులోకి తెచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు వ్యవసాయ కార్మికులంతా సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమర్థించటం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రయోజనాలకు కొత్త చట్టాలు చేయకపోగా ప్రమాదకరమైన ప్రజా వ్యతిరేక చట్టాలు కేంద్రం చేస్తున్నదని వాటికి వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ నిరసనలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, కంకణాల వెంకటేశ్వర్లు, గడ్డం పిచ్చయ్య, గోగుల నారాయణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, తలారి ఆదాం, జి. వందనం, ఎం. దాసు, టి. అంజిబాబు, జి.గోపి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

కార్మికుల హక్కులు కోసం ఈనెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో పోరాటాల సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ గా తెచ్చిన బిల్లును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా నిర్వహిస్తున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ పని గంటలు పెంచుతామని, కార్మిక చట్టాలను సవరిస్తామని గత క్యాబినెట్ సమావేశంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు.. సి హెచ్.అక్కేశ్వరరావు, బి.అరుణ,శ్రీదేవి చిన్నబ్బాయి, శ్రీను, కె.పద్మ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

శింగరాయకొండలో లోక్ ఆదాలత్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని సివిల్ కోర్టులో తొలిసారిగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లరావు మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్ కేసులు త్వరతగతిన పరిష్కరించేదుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి దేశ వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదాలత్‌లో రాజీ పడిన కేసులు మళ్లీ అప్పీలు చేసేందుకు వీలుఉండదని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశం వినియోగించు కోవాలన్నారు. అనంతరం లోక్ ఆదాలత్‌కు హాజరైన వారికి మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నిబోయిన శ్రీనివాసులు, న్యాయవాదులు హరి కోటేశ్వరరావు, కొల్లూరి నరసింహారావు, బక్కుముంతల వెంకటేశ్వర్లు, పంతగాని వెంకటేశ్వర్లు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

10న 'మెగా' సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ నెల 10న రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెగా పేరెంట్ టీజర్ సమావేశాన్ని జిల్లాలో ఇంటర్ కోర్సు నడుపుతున్న ప్రతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.ఆంజనేయులు, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ సైమన్ విక్టర్ కోరారు. మెగా పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహణపై ఒంగోలు ఎకెవికె జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్‌కు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రతి జూనియర్ కళాశాలలో దీనిని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులను, అధికారులను ఆహ్వానించాలి. ప్రత్యేకించి ప్రోత్సాహిక దాతలను, ఉన్నతంగా స్థిరపడ్డ పూర్వ విద్యార్థులను గుర్తించి, వారిని ఆహ్వానించి కళాశాలల అభ్యున్నతికి, వారు తోడ్పాటును ఇచ్చే విధంగా, విద్యార్థుల శ్రేయస్సుకు, స్ఫూర్తి కలిగించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, డిపిఇఒ, ఆర్‌పిఒ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంతో దామచర్ల సత్య

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-చీమకుర్తి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక తూర్పు బజారులో ఎడ్లపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కాట్రగడ్డ రమణయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు ముప్పూరు చలమయ్య, సీనియర్ నాయకులు కందిమళ్ల గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గొల్లపూడి సుబ్బారావు, ఎడ్లపల్లి పిచ్చి వీరయ్య, నర్రా నాగరాజు, కూరాకుల కరుణాకర్ రెడ్డి, ఎ. శేషయ్య, ఎడ్లపల్లి సురేష్, మందాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కంచర్ల శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కంచర్ల రామయ్యకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -మద్దిపాడు

కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో డాక్టర్ కంచర్ల రామయ్య పెద్దకర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బివిఎన్ విజయకుమార్ పాల్గొని రామయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు. కంచర్ల శ్రీకాంత్‌తో కొద్దిసేపు మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో పోతినేని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగోన్నతి, బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన 13 మంది ఉపాధ్యాయులకు శనివారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు 8 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి చేసిన సేవలను, వారి యొక్క నిరంతర కృషిని ప్రశంసించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఉల్లి సుబ్బారెడ్డి, నూకసాని వెంకటేశ్వర్లు, వల్లభుని శంకరరావు, తిరుమలరావు, డి విజయానందు, రంగారావు, ఉద్యోగోన్నతిపై వెళ్లి సూరా శ్యాంప్రసాద్, బుర్లా సుధాకర్‌రెడ్డి, పాకల వెంకటేశ్వర్లు, విడుదల ముసలయ్య, ముత్తుకూరు శ్రీకాంత్, ఊళ్లపాలెం హైస్కూల్‌కి వెళ్లిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె.మహేష్‌బాబు, కె.వెంకట్రావు, పిల్లి హజరతయ్య, పొట్లేళ్ల సుమలత, టి.శోభాదేవి, ఎస్.లలిత, గాలి రజని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శాలువాలు పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ రసూల్, దాసరి రామారావు, సురేష్, సోపర్ల ప్రసాదు, చంద్రశేఖర్, ప్రసాదు, మనోహర్, మాధవరావు, శ్రీదేవి, పీడీలు వడ్లమూడి కోటేశ్వరరావు, వంశీ, సబ్‌స్టాఫ్ ప్రార్థనరావు తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందుతున్న ఉపాధ్యాయులు

మూగ జీవాల దాహార్తి తీర్చాలని వినతి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

గొర్రెలకు, పశువులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బి.రవి కి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజవర్గాల్లో వర్షపాతం తక్కువగా ఉందన్నారు. వైపాలెం, మార్కాపురం, కనిగిరి ,దర్శి, ప్రాంతాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కుంటలు, వాగులు ఎండిపోవడంతో ఎక్కడా నీళ్లు అందుబాటులో లేవన్నారు. నీటి కోసమే రోజుకు ఐదారు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా గ్రామాల్లో నీటి తొట్టు కట్టించినప్పటికీ, వాటిలో నీరు పోయడం లేదన్నారు. దీంతో పశువుల కాపర్లు వలసలు పోతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి ట్యాంకర్ల ద్వారా తొట్లకు నీళ్లు నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలని కోరారు. దీంతో స్పందించి జేడీ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా తొట్లల్లో నీళ్లు నింపే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.పెద్దబ్బాయిఉపాధ్యక్షులు కండే బాలకృష్ణ, బొడ్డు రామరాజు, పూసపాటి వెంకట్రావు, కొండరాజ్ జయరాం, బుర్రి శ్రీరాములు, కొనికి రాఘవ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎన్ఎస్ఎస్ యూనిట్ల పరిశీలన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) యూనిట్ల పనితీరును ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ప్రతినిధి ఎస్.సంజయ్ కుమార్ శనివారం పర్యవేక్షించారు. అందులో భాగంగా ఎకెయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల పనితీరు, నిధుల కేటాయింపు, దత్తత తీసుకున్న గ్రామాలలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చించారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న యూనిట్లకు అదనంగా మరో 75యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంజయ్ కుమార్‌ను విసి ప్రొఫెసర్ మూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. తొలుత సంజయ్ కుమార్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కార్యాలయాన్ని సందర్శించి కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్‌తో మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల పనితీరు, విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలు, ప్రత్యేక క్యాంపులు, నిధుల వినియోగం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



సహకాలంలో స్పందించి కాపాడిన ఎస్ఐ జనార్ధన్

మహిళను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - వేటపాలెం

భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన మహిళను ఎస్ఐ పి జనార్ధన్ చాకచక్యంగా కాపాడారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొణిజేటి చేనేతపురిలో శనివారం ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పొట్లూరి నందిని అనే మహిళ ఉదయం కొత్త కాలువలో పడి ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జనార్దన్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని చేరుకొని ఆమెను ఆత్మహత్యయత్నం నుండి కాపాడారు. ఆమెను బాధపెట్టిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన భర్త పొట్లూరి గణపతి అప్పులు చేసి అప్పులు తనను తీర్చమని రోజు తాగొచ్చి కొట్టడం, చిత్రహింసలు పెడతున్నాడని, తనకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని, భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడబోతున్నానని చెప్పడంతో ఆమెకు అన్నిటికీ ఆత్మహత్య పరిష్కారం కాదని, తన భర్తను తాము అదుపులోకి తీసుకొని విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయని, ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని అన్నారు. సమస్య ఏదైనా ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి తనకు చెప్పి పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు.



ముద్దాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కల్తీ మద్యం ముఠా అరెస్టు

ప్రజాశక్తి - రేపల్లె

కల్తీ మద్యం తయారు చేసే ముఠాను ప్రోహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్ దివాకర్ శనివారం అరెస్టు చేశారు. రూ.10 లీటర్ల ఇతనోల్, 21 కాళీ క్యాన్లు, 510 కాళీ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాలతో ఎస్‌టిఎఫ్‌టిం విశ్వాసనియ సమాచారంతో అరెస్టు చేశామని తెలిపారు. కృష్ణ జిల్లా నాగాయలంక మండలం గొల్లలమోదకు చెందిన విశ్వనాథపల్లి సూర్య, మోళ్లగుంటకు చెందిన మోపిదేవి సతీష్, నూరుకుతి శ్రీనివాసరావు, రూతుల శ్రీనివాస్, చరణ్ జీట్జ్ సెట్ హైదరాబాద్, మోళ్లగుంటకు చెందిన కన్నా రామును అరెస్టు చేసి రిమాండుకు పంపామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మధుబాబు, జనార్దన్, రామారావు, రాజశ్రీ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - వేటపాలెం

వ్యవసాయ విద్యుత్ మోటార్లు దొంగతనాలు చేస్తున్న ముద్దాయిలను అరెస్టు చేసి చోరీకి గురైన మోటార్లను వారివద్దనుండి స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి జనార్ధన్ తెలిపారు. ముద్దాయిల నుండి రూ.1.10లక్షల విలువైన 5హెచ్‌పి మోటర్లు3, 2 హెచ్‌పి మోటర్లు 2 స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చగా రిమాండు విధించినట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకున్న బాజీత్, ఖాసిమ్, శ్రీనివాసరావు, బలరామయ్యను అభినందించారు.

శాంతి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి శాంతి కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కళ్యాణంలో పాల్గొను దంపతులు రూ.1116 చెల్లించి కళ్యాణంలో పాల్గొన్నారని అన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం ఏర్పాట్లు చేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం



కరపత్రాలు పంపిణీ వస్తున్న నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని పట్టణంలోని 33వ వార్డులో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన ఏడాదిలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కరపత్రాలు ప్రజలకు అందజేశారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి, నియోజకవర్గ పరిశీల కులు బొంతు శివ సాంబి రెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఐనంపూడి షాలెం రాజు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా టిడిపి ప్రభుత్వం గత ఏడాదిలో అమలు చేసిన వివరాలను ప్రజలకు చెప్పాలని టిడిపి నాయకులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. టిడిపి గ్రామ అధ్యక్షులు సొంటి వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నాయకులు దీవి రాంబాబు మాట్లాడారు. టిడిపి మండల మాజీ అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, ఆర్యవైశ్య నాయకులు విశ్వం శెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కందుల వెంకటేశ్వరరావు, దుర్గారెడ్డి, నాగుల నరేంద్ర, సుబ్బారావు, బొడ్డు శివయ్య, నాగుల పున్నారావు, సొంటి కోటయ్య పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరించాలని శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సూచించారు. మండలంలోని వెల్లటూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, సర్పంచ్ బొజ్జ రవి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఎంపీటీసీ వాకా వెంకటనారాయణ, పుణ్య శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, నూతక్కి దినకర బాబు, మాచర్ల నాగరాజు, కనపర్తి సుందర్రావు, బట్టు మల్లికార్జునరావు, తిరువీధుల బాలాజీ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి చెరుకుపల్లి నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపిపి లలిత కుమారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి డివి లలిత కుమారి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ప్రస్తుతం పరిషత్ నిధులతో, రాబోయే 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలు చర్చించారు. ఎంపిటిసిల అభ్యర్ధన మేరకు సిసి రోడ్లు, డ్రైన్లు, పైపులైన్లు రిపేర్లకు నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎఒ సిహెచ్ జలజ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : డెంగ్యూ, డయేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున సూచించారు. సీజనల్ వ్యాధులపై దున్నవారిపాలెంలో శనివారం అవగాహన కల్పించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. ఎవరికైనా డెంగ్యూ, డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్సలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మురళి, కాసులు, ఆశ కార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలి నిర్వహిస్తున్న విద్యార్థులు

సెయింట్ ఆన్స్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ విద్యార్థిని షేక్ ఫర్జానా కాకినాడ జెఎన్‌టియు 2020-24 బిటెక్ పరీక్షల్లో యూనివర్సిటి స్థాయిలో ప్రథమ స్థానము పొంది గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శనివారం తెలిపారు. కాకినాడ యూనివర్శిటీలో శనివారం నిర్వహించిన 11వ స్నాతకోత్సవంలో పరీక్షల్లో ర్యాంకు పొందిన తమ కళాశాల సిఎస్‌ఇ ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ జూజు విభాగానికి చెందిన విద్యార్థిని ఎస్‌కె ఫర్జానా యూనివర్సిటి మొదటి స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా జూజు విభాగాధిపతి ఎస్ ఇంద్రనీల్ మాట్లాడుతూ జూజు బ్రాంచి మొదటి బ్యాచ్ విద్యార్థిని ఫర్జానా జెఎన్‌టియుకె పరిధిలోని 155 కళాశాలల విద్యార్థులతో పోటీపడి యూనివర్సిటి మొదటి ర్యాంకు సాధించి గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఫర్జానా మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం కలుగచేసిన ఆధునిక సాంకేతిక విద్యాబోధన సౌకర్యాలు, అత్యంత అధునిక లేబరేటరి, లైబ్రరి సౌకర్యాలు ఉండటం వల్లనే యూనివర్సిటి ర్యాంకు సాధించడానికి దోహద పడినట్లు తెలిపారు. మెడల్ అందుకున్న ఎస్‌కె ఫర్జానాను అభినందించారు.



గవర్నర్ చే గోల్ట్ మెడల్ అందుకున్న ఫర్జానా



పొగాకు ప్రాసెసింగు పరిశీలిస్తున్న ఎఒ సుబ్బారెడ్డి

పొగాకు రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లి పొగాకును కొనుగోలు కేంద్రానికి తెచ్చేముందు రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. పొగాకు ప్రాసెసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు తెచ్చేముందు రైతులు తప్పనిసరిగా గ్రేడింగ్, తేమ శాతం, చెక్కులపై పట్టలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దీని వలన ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పొగాకు అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ముందు తప్పనిసరిగా 20 శాతం లోపు తేమ ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. చెక్కులపై పట్టలు చిరిగిపోకుండా మంచివి వాడాలని సూచించారు. పొగాకు గ్రేడింగ్ సక్రమంగా చేసుకుని, విడివిడిగా ఉండే విధంగా చెక్కులు తీసుకురావాలని చెప్పారు. ఇలా చేస్తే మంచి ధరతోపాటు బేళ్లను తిప్పి పంపకుండా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం అధికారి మారెళ్ళ శ్రీధర్, పంగులూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈఒ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి నీరుకట్టు వాసు బాబు

పొగాకు కొనుగోళ్లలో లోపించిన పారదర్శకత

ప్రజాశక్తి - కారంచేడు

పొగాకు కొనుగోలు విధానంలో ప్రభుత్వ పారదర్శకత లోపించిందని మండల ప్రజా పరిషత్ సమావేశంలో పలువురు సభ్యులు ఆరోపించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నీరు కట్టు వాసు బాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వాసు బాబు, వైస్ ఎంపిపి యార్లగడ్డ సుబ్బారావు, కోఆప్షన్ సభ్యులు ముల్లా నూర్ అహ్మద్ మాట్లాడుతూ శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు రైతులకు న్యాయం చేయడానికి రాష్ట్ర నాయకులు, అధికారులతో మాట్లాడి పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. వేలమంది రైతులకు మంచి పరిణామమని అభినందించారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్పిన వారి నుండి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఇతర రైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. అలాగే ధాన్యం కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే బయట మార్కెట్‌లో తక్కువ ధరకు రైతు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఆన్లైన్లో నమోదు చేసుకున్న వారికి ముందుగా కొనుగోలు చేసి నగదు ఇవ్వాలని కోరారు. మండలంలో ఉపాధి నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. పనిచేసే వారి కంటే పనిచేయని వారికి డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ మండలంలో 1245 ముందు రైతులు పొగాకు కొనుగోళ్ల కోసం ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని చెప్పారు. వీరిలో ఇప్పటివరకు 120 మంది రైతులు నుండి 2040 బేళ్ళు, 2580 క్వింటాల పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మండలంలోని కొమ్ముమూరు కృష్ణ కాలువ రైతులు నాట్లు వేసే సమయం వచ్చిందని చెప్పారు. రైతుల సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యా, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్, ఆరుడబ్ల్యూఎస్, డ్రైనేజీ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె నేతాజీ, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



కలెక్టర్ జె వెంకట మురళికు మొక్క అందిస్తున్న ఎడి

గనుల శాఖ ఎడిగా రామచంద్రయ్య

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గనుల శాఖ సహాయ సంచాలకులుగా రామచంద్రయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు.అనంతరం మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని కలిసి మొక్కను అందించారు.

సైబర్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జివి చౌదరి తెలిపారు. మండలంలోని ఎడారిపల్లెలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆన్లైన్ బెట్టింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని అన్నారు. రాత్రిపూట బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల వెంట మత్తు పానీయాలు స్వీకరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు.

లోకదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోకదాలత్‌లో 392 కేసులు పరిష్కారమైనట్లు లోకదాలతో నిర్వాహక కోర్టు సిబ్బంది తెలిపారు .సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి అధ్యక్షతన లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. పి జానుబాబు, కె సాల్మన్, సిహెచ్ శ్రీరమణి, కె ధనలక్ష్మి పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కేసుల పరిష్కారానికి రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి డి నాగ వెంకటలక్ష్మి, న్యాయవాదులు ఆకుల సత్యవతి, షేక్ మహమ్మద్ రఫీ పిర్యాదులు స్వీకరించారు.

ఘనంగా 'భరద్వాజ్' జయంతి

ప్రజాశక్తి - పంగులూరు

సమాజాన్ని చైతన్య పరిచే నవలలు రచించి, ప్రజలను ప్రభావితం చేసిన ఘనత విశ్వబ్రాహ్మణ లెజెండరీ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజదేనని విశ్వ బ్రాహ్మణ సంఘ జిల్లా యువజన నాయకులు మోగంటి అనిల్ అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి సాంబశివరావు, నూతన సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు రవిచంద్ర చారి, ఉపాధ్యక్షులు కందుకూరి మల్లికార్జునరావు, మచ్చ రమేష్ బాబు, కోటపాటి శ్రీనివాసరావు, నరేష్, అవినాష్ పాల్గొన్నారు.

రుసుం వసూలుకు వేలం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కూరగాయల మార్కెట్ దుకాణాలు, రోజువారి వ్యాపారస్తుల వద్ద రుసుము వసూలుకు పంచాయతీ కార్యాలయంలో శనివారం వేలం నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యన్నారాయణ తెలిపారు. పర్చూరుకు చెంది న షేక్ ఖాజావలి రూ.1.86లక్షలకు హెచ్చుపాటతో వేలం దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ మస్తానరావు, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బాపట్ల

అనారోగ్యంపాలై కుటుంబ పోషణ సైతం భారమై ఇబ్బందులు పడుతున్న బాధితులను ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ తమ వంతు ఆర్థిక సహాయం అందించి మనో ధైర్యం కల్పిస్తుందని ఆర్గనైజేషన్ సభ్యులు బుర్ల సురేష్ అన్నారు. పట్టణంలోని 33వ వార్డు అరవ కాలనీకి చెందిన దువ్వ సామెలు గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ బాధితుడికి తమ ఆర్గనైజేషన్ ద్వారా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశామని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, బత్తుల యజ్ఞ సురేష్, జోగి సువర్ణ, మద్దిబోయిన గోపి, బండ్రెడ్డి అంకమ్మరావు, నరాలశెట్టి నాగరాజు, మచ్చ కృష్ణారెడ్డి, భీమా కోటేశ్వరరావు, షేక్ సుభాని, ఏసోబు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో కృషి చేయాలి

జిల్లా జిడిపిలో ప్రతిఏటా 15శాతం వద్ధిరేటు పెరిగేలా చూడాలి: మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా జిడిపిలో ప్రతి ఏటా 15శాతం వద్ధిరేటు పెరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై స్థానిక కలెక్టరేట్లో జిల్లా ఇన్చార్జి మంత్రి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలంటే వనరులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి పనిచేయాలని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకుని మూడు పంటల విధానం అమలు చేయాలని అన్నారు. ప్రస్తుతం జిల్లా జిడిపిలో 20వ స్థానంలో నిలిచిందని, ప్రతి ఏటా వృద్ధిరేటు 15 శాతం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని అన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతుల పరిస్థితి పునరావతం గాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్ళించాలని అన్నారు. ఆక్వా రంగంలోనూ లాభసాటి సాగు జరిగేలా రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. నీటి సంఘాలకు ఆక్వా సాగు కేటాయించే అంశాలపై ఆలోచనలు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో భారీ పరిశ్రమ స్థాపనకు పెట్టుబడిదారులను ఆహ్వానించాలని అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం రూ.2.19 లక్షలు కాగా, ఏడాదికి 15 శాతం పెంచేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. గడిచిన ఏడాదిలో బాపట్ల జిల్లాలో వస్తువుల అంతిమ ఉత్పత్తి విలువ



సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

రూ.20,163 కోట్లు కాగా, 2028-29 సంవత్సరానికి రూ.38,165 కోట్లు పెరగాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో శాసనసభ్యులు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పి4 కుటుంబాలకు మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ ఇప్పటికే 72శాతం పూర్తయిందని, మిగిలిన 28శాతం త్వరలో పూర్తి చేస్తామన్నారు. 15 ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. అధికారు లంతా మానవత్వంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ చెప్పారు. విజన్ బాపట్ల ప్రణాళికకు చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. పి4 విధానంలో పేద కుటుంబాలను అభివద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చీరాల శాసనస సభ్యులు ఎం మాలకొండయ్య తెలిపారు. కార్యక్రమంలో సిపిఓ షాలేమ్ రాజు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు రామలక్ష్మి, చంద్రశేఖరనాయుడు, బాపట్ల ఆర్‌డిఒ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తున్న ప్రభుత్వం

- 2, 50 డివిజన్లల్లో సుపరిపాలనలో తొలి అడుగు
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని 2వ డివిజన్ బిలాల్ నగర్, 50వ డివిజన్ నెహ్రూ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు డివిజన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని యాప్‌లో నమోదు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పాలనలో రూ.117 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఒంగోలు నగర సుందరీకరణకు చర్యలు చేపట్టామని అన్నారు. పార్కులు, డివైడర్లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఒంగోలు నగరానికి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రతి రోజు మంచినీరు త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. మిగిలిన సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు పాల్గొన్నారు.



రామలింగేశ్వర స్వామి దేవాలయం

కన్నుల పండుగగా తిరునాళ్ల

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరు కొండపై ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఏకాదశి తిరునాళ్లు శనివారం కన్నుల పండుగగా జరిగాయి. తొలి ఏకాదశి తిరుణాల సందర్భంగా వేకుజామునే గిరిప్రదక్షిణ చేసిన వారికి అల్పాహారం, ప్రత్యేక పూజ కైంకర్యాలకు భక్తులకు పెద్ద సంఖ్యలో వచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. 11వ శతాబ్దంలో చోళ రాజుల కాలంలో ఆలయాన్ని నిర్మించారని స్థల పురాణం చెబుతుంది. ఆలయం శిథిలావస్థకు చేరడంతో భక్తులందరి సహకారంతో రూ.4కోట్లతో ఆలయాన్ని ఆధునికరించారు. మరో రూ.20 లక్షలతో ఆలయానికి కుడివైపు మండపం నిర్మించారు. మెట్లతోపాటు ఘాట్‌రోడ్డు నిర్మించారు.

ఉచిత ప్రయాణాలకు సిద్ధం

ప్రజాశక్తి - చీరాల

ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని, సమయ పాలనతో హామీలు నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సున్నపు రెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక పరిస్థితులను ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల తోకలసి పరిశీలించారు.

మద్యం ఎమ్మార్పీకే విక్రయించాలి

ప్రజాశక్తి - బాపట్ల

లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుండి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ఎక్సైజ్ ఎసి గీతిక సూచించారు. లైసెన్స్ మద్యం షాపుల నిర్వహణదారులతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ జిల్లా అధికారి బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు మద్యం విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 14405, బాపట్ల సిఐ 94409 02478 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐలు డి ప్రభుదాస్, ఎస్ మౌనిక పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ మంత్రి నాగార్జున

వైసిపి నేతల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన జగన్నాథం వేణుబాబుకు మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. ఇంకొల్లు మండలం పావులూరులో శనివారం జరిగిన వైసిపి సమావేశంలో ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. వేణు బాబు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పవైసీపీ పర్చూరు ఇంచార్జి గాదె మధుసూదన్‌రెడ్డి, దాతలు కట్టా రత్నరాజు, గర్నెపూడి రవి చంద్, కూరాకుల ఇస్సాకు, దాసి నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి హరిబాబు

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్యం, మంచి నీరు, ఉపాధి హామీ అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ చిన్నిపోతుల హరిబాబు కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల అమలులో సాంకేతిక ఇబ్బందులను అధిగమించి అర్హులైన పేదలకు అందించేందుకు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పారిశుధ్యం, త్రాగునీరుపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి బాబురావు, మండల ఉపాధ్యక్షులు షేక్ అప్సర, సిఎస్ డిటి ఫణి కుమార్, ఎఓ చక్రధరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరక్టర్ పి రవి కుమార్

విఆర్ఎస్ విద్యార్థికి రాష్ట్ర ర్యాంకు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా వాస్తవ్యులైన యలమంచిలి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సిఇఒ యలమంచిలి రామకృష్ణ మన ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ ఇసిఇ చివరి సంవత్సరం విద్యార్థిని గుత్తి నాగరత్నప్రియ 96శాతం మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాదించారని తెలిపారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ పలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులైన షేక్ రజియ సుల్తానా, షేక్ స్థానక్ వలి, పల్లెకాన వంశీ, పాలవెల్లి విష్ణుప్రియ, ఉసుమల్లి చందు కుమార్, కర్లకుంట వెంకటేశ్వర్లు, గుత్తి నాగరత్నప్రియ, పాలపర్తి శ్వేత, మెకానికల్ విద్యార్థులు మాదిగాని జీవన దత్తు సిద్ధు, గుమ్మడి జాన్ రాజు, సనగన ఇందిర లక్ష్మీ వరుణ్, వడ్లమూడి హేమంత్, షేక్ నజీర్, వాయల మీనాక్షి, వాటుపల్లి పూజ, కొక్కిలిగడ్డ మానసకు వారి తల్లి, తండ్రుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి రాధాకుమారి, జనరల్ మేనేజర్ పట్టాభి దానయ్య పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనంలో దామచర్ల సత్య . వారి కుటుంబ సభ్యులు

శ్రీవారిని దర్శించుకున్న 'సత్య'

ప్రజాశక్తి- టంగుటూరు

రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య తమ కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సత్య వెంట దామచర్ల జయలక్ష్మి, షర్మిక, రుషి, కార్తికేయ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

నేడు 'దాచూరి' మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

శాసనమండలి మాజీ సభ్యులు దాచూరి రామిరెడ్డి స్మారక రెగ్యులర్ మెడికల్ క్యాంపు స్థానిక నెల్లూరు బస్టాండ్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ శిబిరంలో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం కలిగిన రోగులకు 2 నెలలకు సరిపడ మందులు కేవలం రూ.200 అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులో వివిధ విభాగాల్లో అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి. హరిబాబు, డాక్టర్ సిహెచ్. సుధాకర్ బాబు,డాక్టర్ ఎల్. జాన్‌రిచర్డ్స్, డాక్టర్ చాపల వంశీకష్ణ, డాక్టర్ ఎస్. ధీరజ్ బాబు, డాక్టర్ ఎస్. సందీప్ ప్రకాష్, డాక్టర్ జి. చైతన్య, డాక్టర్ ఎం.శరత్, డాక్టర్ కొల్లా భారతి, డాక్టర్ ఎస్‌కె.సమీర్ శర్మ, డాక్టర్ రంజిత్ బాషా, డాక్టర్ రవితేజ, డాక్టర్ సుందర్ ప్రసాద్ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ పాటికే వైద్యం పొందుతున్న రోగులు బిపి, షుగర్ రక్త పరీక్షలు చేయించుకుని ఆ రిపోర్టులు తో పాటు, పాత మందుల చీటీలతో వైద్య శిబిరానికి హాజరు కావాలన్నారు. కొత్తగా వచ్చే వారు వైద్య పరీక్షలు చేయించుకొని ఆ రిపోర్టు, మందుల చీటీ, ఆధార్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-మద్దిపాడు : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని జడ్‌పి సిఇఒ చిరంజీవి తెలిపారు. మండల కేంద్రమైన మద్దిపాడులో శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి నుంచి చెత్త సేకరణను పరిశీలించారు. క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చిరంజీవి వెంట సెక్రటరీ ఆశా లక్ష్మి, వినయ్, ఉన్నారు.

పొగాకు వేలం కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

పొగాకు కంపెనీ ప్రతినిధులు వేలం కేంద్రానికి వచ్చిన అన్ని గ్రేడులను పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ శీలం రామారావు తెలిపారు. కొండపి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు వేలాన్ని శనివారం పరిశీలించారు.అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మండేలలో మగ్గిన పొగాకును బేళ్లు కట్టుకొని వేలం కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

కొండపి వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 872 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 635 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 237 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280,కనిష్ట ధర రూ. 160, సరాసరి ధర రూ.228.45 పైసలు పలికింది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కంచర్ల రామయ్య జీవితం ఆదర్శం

నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-కందుకూరు

డాక్టర్ కంచర్ల రామయ్య జీవితం ఎంతోమందికి ఆదర్శమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కొనియాడారు. కంచర్ల రామయ్య దశదినకర్మ ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాప సభలో కుప్పం నియోజకవర్గ వారు ఏర్పాటు చేసిన హరికథ, గానామతం అందరినీ ఆకట్టుకుంది. తొలుత నారా భువనేశ్వరి పాల్గొని రామయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామయ్య జీవితానికి సంబంధించిన ఎవిని భువనేశ్వరి వీక్షించారు. రామయ్య జీవితాన్ని గురించి కొన్ని విషయాలు వారి కుమారుడు శ్రీకాంత్‌ను అడిగి ఆమె తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, కుప్పం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను, వారి సోదరుడు డాక్టర్ విజయ శ్రీనివాసరావు, రామయ్య సతీమణి ధనమ్మను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, వ్యాపారవేత్తగా, పాత్రికేయునిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రకాశం కాలేజీని స్థాపించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను చేరువులోకి తెచ్చిన డాక్టర్ రామయ్య జీవితం ఎంతోమందికి ఆదర్శమని కొనియాడారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తన తండ్రి రామయ్య స్ఫూర్తితోనే తాము ఈ స్థాయిలో ఉన్నామని, తాము కష్టంలో ఉన్నప్పుడు అండగా ఉన్న కుప్పం ప్రజలకు, కందుకూరు నియోజకవర్గ ప్రజలకు తమ మిత్రులకు ఎంతో రుణపడి ఉన్నామని తెలిపారు. దండోరా దాస్ సభా అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాయకుడు చలంచర్ల సుబ్బారావు కొన్ని శ్లోకాలను ఆలపించారు. నివాళులర్పించిన వారిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారామ్, టిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ సురేష్ బాబు, ప్రకాశం జిల్లా ఎస్‌పి దామోదర్, సినీ నటుడు దిల్ రాజు, గిరిబాబు తనయుడు రవిబాబు, మాజీ ఎమ్మెల్యే హరిబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ, మాజీ ఎంపీపీలు పోటు పెదబాబు దంపతులు, చదలవాడ చంద్రశేఖర్, టిడిపి నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : మంత్రి

ప్రజాశక్తి- టంగుటూరు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్త కుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గపరిధి లోని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో శనివారం విడివిడిగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట కొత్తగా బోర్లు వేయించాలన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. రామతీర్థం ప్రాజెక్టు నుంచి మర్రిపూడి మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరాపై అధికారులతో మంత్రి చర్చించారు. గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యానికి పెద్ద పీట వేయాలన్నారు. డయేరియా ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారం తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా పారిశుధ్య లోపం కనిపించడ కూడదని తెలిపారు. కొండపి నియోజకవర్గంలో నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి నియోజక వర్గ పరిధిలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ బాల శంకర్, డిఇఇ వేముల వేణుగోపాలరావు, ఎఇలు సిహెచ్. వెంకటేశ్వరరావు, పూనూరి కిషోర్ బాబు, పట్నం రమేష్‌బాబు, మహేంద్రరెడ్డి, జాన్‌పాల్,యు.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఆ ఉత్తర్వులను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ నెల 10న రాష్ట్రవిద్యా శాఖ తలపెట్టిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించే మెగా పిటిఎంలో విట్నెస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని వారి చేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి విద్యార్థుల విద్యాభివద్ధి మీద, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల సదుపాయాల మీద మాట్లాడుకోవటానికి 17 రకాల కమిటీలు, ఫోటోలు విటనెస్ అధికారి అప్ లోడ్ లాంటి తతంగం అవసరమా? అని యుటిఎఫ్ ప్రశ్నిస్తుందని వారు పేర్కొన్నారు. డాక్యుమెంట్రీని కార్యక్రమంగా మార్చడం సరికాదన్నారు. విద్యార్థుల,విద్యాభివద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దాన్ని మార్చాలని యుటిఎఫ్ కోరుతుందన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధ నేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగిస్తుందని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, మెగా పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తుందని విమర్శించారు. మెగా పిటిఎంలో విట్నెస్ అధికారిని నియమించుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఏఆర్. దామోదర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలు, వారు నిర్వహిస్తున్న వీధుల గురించి ఆరా తీశారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్, గస్తీ నిర్వహించాలని సూచించారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని తనఖీ చేయాలన్నారు. వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఎస్‌పి వెంట ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, టంగుటూరి నాగమల్లేశ్వం రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీ నియామకం

ప్రజాశక్తి-టంగుటూరు : వైసిపి టంగుటూరు మండల కమిటీని నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు శనివారం తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా జి. వెంకటరెడ్డి, పులిచెర్ల కోటయ్య, ప్రధాన కార్యదర్శిగా వాకా వెంకట కృష్ణారెడ్డి, నంబూరి అశోక్, మర్రి భాస్కరరెడ్డి, ఎం.విష్ణు, కార్యదర్శులుగా సింగమనేని బ్రహ్మయ్య, అక్కుల శ్రీనివాసరెడ్డి, కొమ్ము బాబూరావు, నీరుకొండ శింగయ్య, గుంతోటి శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఈద వెంకటరెడ్డి, ఆర్.నారాయణ, ఈదర అమరనాథ్ చౌదరి, వల్లంరెడ్డి నరశింహారెడ్డి, జి. వెంకటేశ్వరరావు, అద్దంకి వెంకట దినేష్, నర్రా శ్రీనివాసరావు, కుదం శ్రీనివాసరెడ్డి, నల్లమాలపు శ్రీరాములు, లింగారెడ్డి సురేంద్ర రెడ్డి, ఉప్పలపాటి సుబ్బరాజు, తమ్మినేని లక్ష్మీనరశింహా స్వామి, బెజవాడ రమేష్‌బాబు, మేడికొండ రాములు, వాకా కుమార్‌రెడ్డిని నియమించినట్లు ఆయన తెలిపారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ : మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని బింగినపల్లి ఎస్‌టి కాలనీలో ఆరోగ్య విస్తరణ అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్ అలీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరపు జాలిరెడ్డి, బీసాబత్తిన శ్రీనివాసులు, ఆరోగ్య సహాయకులు ఆర్.సుభాకర్, టి. శ్రీనివాసులు, ఎఎన్ఎంలు విజయలక్ష్మి, జ్యోత్స్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.